
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శనివారం 26 అక్టోబరు 2024

విద్యుత్ చార్జీల పెంపుపై భిన్న వాదనలు



- పెంచవద్దన్న బీఆర్ఎస్ నాయకులు
- పెంపుపై కొందరి సుముఖత
- సెస్‌ను ఎన్‌పీడీసీఎల్‌లో కలపాలి
- వస్త్ర పరిశ్రమకు విద్యుత్ రాయితీ పెంచాలి
- విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి
- తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగ విచారణ

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదలపై వాడీవేడిగా చర్చ సాగింది. చార్జీల పెంపుపై భిన్న వాదనలు వినిపించాయి. బీఆర్ఎస్ నాయకులు విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తున్నామని, డిస్కం ప్రతిపాదనలు తిరస్కరించాలని కోరారు. మరికొందరు విద్యుత్ చార్జీల పెంపుపై సుముఖత తెలిపారు. సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘాన్ని ఎన్‌పీడీసీఎల్‌లో కలపాలని కోరారు. రైతులు విద్యుత్ సమస్యలను ముందుకు తీసుకొచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో విద్యుత్ టారిఫ్ సవరణపై తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగ విచారణ చేపట్టింది. నియంత్రణ మండలి చైర్మన్ తన్నీరు శ్రీరంగారావు, మెంబర్ ఆఫ్ టెక్నికల్ ఎండీ మనోహర్‌రాజు, మెంబర్ ఆఫ్ ఫైనాన్స్ కృష్ణయ్య ఆధ్వర్యంలో విచారణ కొనసాగించారు.

నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ ప్రతిపాదించిన 2024- 25 నుంచి 2028- 29 వరకు డిస్ట్రిబ్యూషన్ వ్యాపారం ఆదాయ అవశ్యకత, వ్యాపారం, బిల్లింగ్ చార్జీలు, సబ్సిడీలు, ఇతర అంశాలపై బహిరంగ విచారణలో పలువురు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ముందుగా సిరిసిల్ల సెస్ ఎండీ శ్రీనివాసరెడ్డి, సెస్ ద్వారా చేపట్టిన విద్యుత్ సరఫరా, వ్యాపారాలను ఈఆర్‌సీ ముందుంచారు. ప్రభుత్వం నుంచి వివిధ సబ్సిడీల ద్వారా సంస్థలకు రూ.766.21 కోట్లు రావాల్సి ఉందని, వివరించారు. దీంతోపాటు యూనిట్ చార్జీలు పెంపు ప్రతిపాదనలు చేయడం లేదని ఫిక్స్‌డ్ ప్రతిపాదనలనే పెంచడానికి ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ తరఫున రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల ఎమ్మెల్యే కే తారకరామారావు విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ కొన్ని ప్రతిపాదనలు ఈఆర్‌సీ ముందుకు తెచ్చారు. కొందరు రైతులు విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లు రిపేరు చేయడం లేదని, పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను రోడ్ల పక్కకు మార్చాలని కోరారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినపుడు రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ బిల్లుకు సంబంధించి రూ.30 వస్తే రూ.70 జరిమానా వేయడంతో భారం అవుతోందన్నారు.


విచారణ జరుపుతున్న ఈఆర్‌సీ చైర్మన్ శ్రీరంగారావు

మిగతా 8వ పేజీలో

న్యూస్ బాక్స్

నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

తంగళ్లపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఏఎంసీ చైర్మన్ స్వరూప తిరుపతిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జల్లం ప్రవీణ్ అన్నారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం తాడూరు, దేశాయిపల్లె, అంకిరెడ్డిపల్లె గ్రామాల్లో ఆయ గ్రామ శాఖ అధ్యక్షుల ఆధ్వర్యంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నర్సింగం గౌడ్, ఏఎంసీ డైరెక్టర్లు, గ్రామాల అధ్యక్షులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

కోనరావుపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం టీఎస్‌యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక కోనరావుపేటలో శుక్రవారం జరిగింది. అధ్యక్షుడుగా వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా గాలిపెల్లి సంతోష్, మహిళ ఉపాధ్యక్షురాలుగా కట్ట రాజమణి, కోశాధికారిగా శిలగాని మహేష్, కార్యదర్శులుగా సతీష్, రేణుక ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నాయకులు రాజు, మహేందర్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్‌కు విన్నపాలు

సిరిసిల్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కే తారక రామారావుకు పలువురు తమ సమస్యలు తెలుపుతూ వినతిపత్రాలు అందజేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు హైదరాబాద్‌కు వెళ్తి కేటీఆర్‌కు వినతిపత్రం అందించారు. మున్సిపల్ కార్మికుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించి కనీస వేతనం రూ.26 వేలు అందించాలని సీఐటీయూ నాయకులు రమణ, గణేష్ కోరారు. సిరిసిల్లలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు తమకు ఇళ్లు కేటాయించాలని వినతిపత్రం అందించారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగం

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించనున్నట్లు జిల్లాలో ఎల్ఆర్ఎస్ కోసం 42,942 దరఖాస్తులు రాగా అందులో 10,492 పూర్తిగా పరిష్కరించినట్లు, మిగిలిన వాటిని దశల వారీగా పరిష్కరించనున్నట్లు జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి అన్సారీ తెలిపారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో శుక్రవారం ఎల్ఆర్ఎస్ వేగం పెరిగేనా అనే శీర్షికతో ప్రచురితమైన వార్త కథనానికి జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి అన్సారీ స్పందించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలో 16,336 దరఖాస్తులకు 4174, సిరిసిల్ల మున్సిపల్‌లో 10,493కు 4644, గ్రామ పంచాయతీల్లో 12356 దరఖాస్తులు రాగా 1235 పరిశీలించామన్నారు. అలాగే వీటీడీఏలో 3757 రాగా, 513 పరిష్కరించడం జరిగిందని అన్నారు. మిగతా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


ఆలయ ధ్వజస్తంభ మహోత్సవంలో ఆది శ్రీనివాస్

కోనరావుపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మికతను పెంపొందించే విధంగా ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం మట్టిమల్ల గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించి పాఠశాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్య అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. పురాతన ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, ప్రజాప్రతినిధులు శంకర్, కొమ్ము బాబు, నందు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం చేయాలి

చందుర్తి, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి) పోలీస్ అమరవీరుల దినోత్సవంలో భాగంగా సిరిసిల్లలోని పద్మనాయక కల్యాణ మండపంలో శనివారం నిర్వహించే రక్తదాన శిబిరంను విజయవంతం చేయాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా రక్తదాన శిబిరం సక్సెస్ చేయాలన్నారు.

నిందితులకు శిక్షపడడంలో పీపీల పాత్ర కీలకం

- సమన్వయ సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్
- అధికారులు, సిబ్బందికి ప్రశంసలు


మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

8

ప్రభుత్వం స్పందించకుంటే భవిష్యత్ కార్యాచరణ

- తాజా మాజీ సర్పంచులు
- 8వ రోజుకు రిలే దీక్షలు



దీక్షలో కూర్చున్న తాజా మాజీ సర్పంచులు

8

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు


సమావేశంలో మాట్లాడుతున్నకలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పీహెచ్‌సీల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పని తీరు, వాటి సమస్యలు, సిబ్బంది కొరత వంటి పలు అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 2 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 13 పీహెచ్‌సీలు, వాటి పరిధిలో గల సమస్యలు, అవసరమైన మౌలిక వసతులపై సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కేంద్రంలో ఉన్న డయాగ్నస్టిక్ హబ్ ను వినియోగించుకోవాలని, రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు డయాగ్నస్టిక్ హబ్ ద్వారా చేయాలని సూచించారు. డెంగ్యూ ,మలేరియా మొదలగు నిర్ధారణ పరీక్షలను అవసరమైన రోగులకు ఉచితంగా చేయాలని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణులు గుర్తింపు, ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్ వంద శాతం జరగాలన్నారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, వసంతరావు, ప్రోగ్రామ్ అధికారులు, మెడికల్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తున్నాం

- మాజీ మంత్రి కేటీఆర్


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

సిరిసిల్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కే తారకరామారావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో విద్యుత్ టారిఫ్ సవరణపై తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగ విచారణ చేపట్టింది. విచారణలో కేటీఆర్ ప్రతిపాదనలు, అభిప్రాయాలను వెల్లడించారు. ప్రభుత్వం రకరకాల చార్జీల పేరిట మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచే విధంగా కుట్ర చేస్తోందన్నారు. అదనపు అదాయం కోసం రూ.18,500 కోట్ల భారం మోపే ఆలోచన దుర్మార్గమైందన్నారు. డిస్కం చేసిన తొమ్మిది ప్రతిపాదనలను తిరస్కరించాలన్నారు. సిరిసిల్ల పవర్‌లూం నేతన్నలకు 50 శాతం రాయితీతో పదిహెచ్‌పీలను 30 హెచ్‌పీలకు పెంచాలన్నారు. ఇళ్ల విద్యుత్ వాడకంలో 300 యూనిట్ల వరకు ఫిక్స్‌డ్ చార్జీలుగా ఉన్న రూ.10 నుంచి రూ.50కి పెంచడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. సిరిసిల్ల సెస్ పరిధిలో 1.26 లక్షల గృహ కనెక్షన్లు ఉన్నాయని, ఎండాకాలంలో 300 యూనిట్లకుపైగా 75 నుంచి 80 శాతం కుటుంబాలు వాడుకుంటాయని అన్నారు. డిస్కంల ప్రతిపాదలను వాస్తవ పరిస్థితులకు పొంతన లేదన్నారు. పదేళ్లలో కరెంట్ చార్జీలు ఒక్క పైసా పెంచలేదని, మోటార్లకు మీటర్లు పెట్టలేదని అన్నారు. నాయీ బ్రాహ్మణులు, రజకులు, ఎస్సీ, ఎస్టీ గృహాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా అందించామన్నారు. కరెంట్ సమస్య నుంచే తెలంగాణ మలి ఉద్యమం కేసీఆర్ రూపంలో పుట్టిందని, కరెంట్ చార్జీలు పెంచితేనే తన పదవికి రాజీనామా చేసి రైతుల పక్షాన గర్జించారని అన్నారు. మళ్లీ అదే పరిస్థితి పునరావృతమవడం శోచనీయమన్నారు. 1970 దశకంలో సెస్ ఏర్పడిందని, డిస్కమ్‌లు చేసే పనితీరు కంటే వంద శాతం మెరుగ్గా పని చేస్తోందని అన్నారు. పవర్‌లూం పరిశ్రమకు 10 హెచ్‌పీల నుంచి 30 హెచ్‌పీల వరకు రాయితీ పెంచాలని, వ్యవసాయానికి సంబంధించి 5 హెచ్‌పీలనుంచి 7.50 హెచ్‌పీల వరకు రాయితీని ఉపయోగించుకునే విధంగా పెంచాలన్నారు. గ్రీన్ చానల్ ఏర్పాటు చేసి సెస్‌కు రావాల్సిన సబ్సిడీ అందించాలన్నారు. సిరిసిల్ల మరమగ్గాల కార్మికుల సమస్యలను అర్థం చేసుకోవాలని, గతంలో బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్, రంజాన్, క్రిస్మస్ ఆర్డర్లు ఇచ్చి పరిశ్రమను బతికించుకున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.400 కోట్లతో వర్కర్‌టు ఓనర్ పథకం అపెరల్ పార్కు, మరమగ్గాల ఆధునికీకరణ వంటి చర్యలతో నేతన్నల ఆత్మహత్యలు అగిపోయాయని, ఇప్పుడు తిరిగి ప్రారంభమయ్యాయని అన్నారు. విద్యుత్ రాయితీకి సంబంధించి పెంచాలని, సిరిసిల్లను మరో తిర్పూర్‌గా చేయాలన్నదే కేసీఆర్ ఆశయమని గుర్తు చేశారు. అశాస్త్రీయంగా చిన్న, సూక్ష్మ, మధ్య తరగతి భారీ పరిశ్రమలను సంబంధించిన కేటగిరీలను ఒకే దాని కిందికి తీసుకరావడం అంటే అదానీ పరిశ్రమ, సిరిసిల్లలో మరమగ్గాలు నడిపే ఆసామి ఒకే ఘాటిన కట్టినట్లు అవుతుందన్నారు. 11కేవీ, 33 కేవీ, 132 కేవీ, 220 కేవీ కింద పరిశ్రమలు ఉంటాయని, వాటిని అన్నింటిని ఒకే కేటగిరీకి తేవడంపై ప్రభుత్వం బుర్రపెట్టి ఆలోచించాలని అన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు పదిహెచ్‌పీల వరకు ఉన్న సబ్సిడీ రాయితీని 30 హెచ్‌పీలకు పెంచాలన్నారు. కరెంట్‌పై పైసా పెంచకుండా అలాగే నడపాలని, పైసా పెంచినా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొట్లాడుతామని అన్నారు. ఆయన వెంట ఎమ్మెల్సీ ఎల్.రమణ, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీ మాజీ చైర్‌పర్సన్లు తుల ఉమ, న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి పాల్గొన్నారు.

పోలీస్ అమరుల ఆశయ సాధనకు కృషి చేయాలి


సిరిసిల్లలో బైక్ ర్యాలీలో ఎస్పీ, పోలీసులు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 25: పోలీస్ అమరుల ఆశయ సాధన కోసం కృషి చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్, 17వ బెటాలియన్ సంయుక్తంగా శుక్ర వారం సిరిసిల్లలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారక్షణ, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ముందుకు సాగుతున్న పోలీసుల కృషి అభినందనీయమన్నారు. ప్రజా క్షేమం కోసం పనిచేస్తూ అమరులైన వారి త్యాగాలను స్మరించుకునేలా ఏటా పోలీస్ ఫ్లాగ్‌డే నిర్వహిస్తున్నామన్నారు. అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజలతో మరింత మమేకమవ్వాలన్నారు. ప్రతీ ద్విచక్రవాహనదారుడు కుటుంబ క్షేమం కోసం హెల్మెట్ ధరించాలని, వాహనదారులు ట్రాఫిక్-రోడ్డు భద్రత నియమాలు పాటించాలని అంతకుముందు ఎస్పీ అఖిల్ మహాజన్, 17వ బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాసరావు ర్యాలీలో ద్విచక్రవాహనం నడిపారు. సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, టౌన్ సీఐ కె. కృష్ణ, ఆర్ఐలు మధుకర్, రమేశ్, సీఐలు పాల్గొన్నారు.

సిరిసిల్ల క్రైం: పోలీసు అమరవీరుల సంస్మరణ వారో త్సవాల్లో భాగంగా సిరిసిల్ల పట్టణంలోని పుర వీధుల్లో శుక్రవారం రాత్రి పోలీసులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పోలీసు అధికారులు, పురప్రముఖులు పాలుపంచుకున్నారు. శనివారం ఉదయం 9గంటలకు సిరిసిల్ల పట్టణంలోని పద్మనాయక కల్యాణమండపంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ప్రజలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేటి నుంచి పశుగణన చేపట్టాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 25 (అంధ్రజ్యోతి) : అఖిల భారత పశుగణను జిల్లాలో శనివారం నుంచి ఫిబ్రవరి 28 వరకు నిర్వహించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం 21వ అఖిల భారత పశు గణనకు సంబంధించిన తెలంగాణ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశు గణన డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లో పశు గణన జరుగుతుందన్నారు. ఎన్యూమరేటర్ల పనిని మండల స్థాయిలో సూపర్ వైజర్లు పర్యవేక్షిస్తారని, దీనికోసం ఆ మండలాలకు చెందిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, పశు వైద్యఅధికారులు పాల్గొన్నారు.

తుది దశకు వంతెన పనులు

- పూర్తవుతున్న మల్లారెడ్డిపేట బ్రిడ్జి
- తగ్గనున్న దూర భారం


గంభీరావుపేట- మల్లారెడ్డిపేట మధ్య మానేరు వాగుపై వంతెన

గంభీరావుపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట-మల్లారెడ్డిపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై వంతెన నిర్మాణం పనులు తుది దశకు చేరాయి. వంతెన నిర్మాణం కోసం ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కింద రూ.7 కోట్ల 50 లక్షలు మంజూరయ్యాయి. వంతెన నిర్మాణంలో నిధుల కొరత కారణంగా తొలుత పనులు మందకొడిగా సాగాయి. చివర్లో వేగం పుంజుకున్నాయి. ఎట్టకేలకు వంతెన నిర్మాణంలో క్యూరింగ్ వంటి చిన్న చిన్న పనులు మినహా పూర్తి కానుంది. ఈ వంతెన నిర్మాణంతో రెండు గ్రామాల మధ్య దూర భారం తగ్గనుంది. మల్లారెడ్డిపేట ప్రజలు పలు అవసరాల కోసం మండల కేంద్రానికి లింగన్నపేట మీదుగా వచ్చేవారు. దీంతో 8 కిలో మీటర్ల వరకు దూర భారం అయ్యేది. వంతెన మీదుగా కేవలం 4 కిలో మీటర్లే దూరమే ఉండనుంది. వంతెన నిరాణం కంటే ముందే గంభీరావుపేట - మల్లారెడ్డిపేట మధ్య బీటీ రోడ్డును నిర్మించారు. ఎగువ మానేరు మత్తడి దూకిన సమయంలో వాగు ఉప్పొంగడంతో ఈ మార్గం గుండా వాహనాల రాకపోకలు నిలిచిపోయేవి. లింగన్నపేట-గంభీరావుపేట మధ్య మానేరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం లో లెవల్ బ్రిడ్జిని కూల్చేయడంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడ్డారు. వర్షాకాలంలో మానేరు వాగు ఉధృతంగా ప్రవహించి, లింగన్నపేట - గంభీరావుపేట గ్రామాల మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోతే మల్లారెడ్డిపేట వంతెన మీదుగా వాహనాల రాకపోకలు కొనసాగే అవకాశం ఉంది.

బండి సంజయ్ కృషి ఫలితమే

- గంట అశోక్, బీజేపీ మండల అధ్యక్షుడు



కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కృషి ఫలితమే మల్లారెడ్డిపేట వంతెన నిర్మాణం. ఈ వంతెన నిర్మాణంతో దూర భారం తగ్గనున్న విషయాన్ని విన్నవించాం. నిధుల మంజూరుకి కృషి చేశారు.

తగ్గనున్న దూర భారం

- పత్యం అంజనేయులు



వంతెనతో ఈ రెండు గ్రామాల ప్రజలకు దూర భారం తగ్గనుంది. ఈ ప్రాంత ప్రజల ఎన్నో ఏళ్ల కల సాకారం కానుంది. ఏ పనైనా మండల కేంద్రానికి వెళ్లాల్సిందే. లింగన్నపేట మీదుగా వెళుతుండేవాళ్లం.

క్రైం కార్నర్

సైబర్‌క్రైం కేసులో ఇద్దరు గుజరాతీల అరెస్టు

- పెట్టుబడి పేరుతో 33.63 లక్షలు కొల్లగొట్టిన నిందితులు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైం కేసులో గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు నిందితులను కరీంనగర్ సైబర్ క్రైం ఏసీపీ వి నర్సింహారెడ్డి అరెస్టు చేశారు. డిప్యూటీ ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్‌కు చెందిన పచ్చునూరు సురేందర్ మొబైల్ ఫోన్‌కు టెలిగ్రాం యాప్, వాట్సాప్ ద్వారా 2023 సెప్టెంబరు 21 అహ్మద్‌ఖాన్ అనే వ్యక్తి ఒక లింక్ పంపించాడు. బంగారం, ఎక్స్‌ఆర్‌పీలలో పెట్టుబడి పెడితే త్వరగా డబ్బులు రెట్టింపు అవుతాయని వాట్సాప్ చాటింగ్ ద్వారా నమ్మబలికాడు. దీనిని నమ్మిన సురేందర్ 2023 నవంబరు 2 నుంచి 2024 జూలై 2 వరకు 33 లక్షల 63 వేల రూపాయలు అహ్మద్‌ఖాన్ పంపించిన ఎస్‌బీఐ, ఇండియన్ బ్యాంక్ ఖాతాల్లో 30 లావాదేవీల్లో జమ చేశాడు. ఆ తరువాత అహ్మద్‌ఖాన్ తన బ్యాంక్ ఖాతా ఫ్రీజింగ్ ఆప్షన్‌ను విత్‌డ్రా చేసుకుని మోసానికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితుడు కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులు విచారణ జరిపి సైబర్ మోసంలో ఏడుగురు నిందితుల ప్రమేయం ఉన్నట్లు నిర్ధారించారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉండగా గుజరాత్‌కు చెందిన నిందితులు ఇద్దరు షేక్ అఫ్తాబ్, దివాన్ మురాద్‌షాను గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ నెల 23న అరెస్టు చేసి అక్కడి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం ఇద్దరు నిందితులను ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తీసుకువచ్చి కోర్టులో హాజరుపరిచారు. నిందితులు తెలంగాణ, మహారాష్ట్రలో ఇదే విధమైన పలు సైబర్ నేరాలకు పాల్పడినట్లు సైబర్ పోలీసుల విచారణలో వెల్లడైంది. కాగా సైబర్ నేరగాళ్ల అరెస్టులో కీలకంగా పనిచేసిన కరీంనగర్ సైబర్ క్రైం రాణా డిప్యూటీ ఏఎస్పీ వి నర్సింహారెడ్డిని టీజీసీ ఎస్‌బీ డైరెక్టర్ అభినందించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ గ్రామానికి చెందిన వినయ్(23) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వినయ్ రాఘవపూర్ ఇటుక బట్టీల ప్రాంతంలో విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతుండగా షాక్ తగలడంతో స్పృహ తప్పి పడిపోయాడు. పెద్దపల్లి ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు పేర్కొన్నారు. ఈ సంఘటనపై ఇంకా ఎలాంటి ఫిర్యాదు రాలేదని బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ సీజ్

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొంపల్లి గుట్ట నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు గురువారం రాత్రి మట్టిని తరలిస్తున్నా టిప్పర్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ అనుమతులు ఉన్నా సమయపాలన పాటించాలని, అక్రమ మట్టి దందాదారులపై చర్యలు తప్పవన్నారు. ఆర్ఐ భాను, సిబ్బంది ఉన్నారు.

టెలీఫోన్ క్వార్టర్స్ ప్రాంతంలో దొంగతనం


తాళం పగులగొట్టిన దుండగుడు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని టెలీఫోన్ క్వార్టర్స్ ప్రాంతం రోడ్ నంబర్-1లోని జె రఘునందన్‌రావు ఇంటి తాళాలు పగులగొట్టి బంగారం, నగదు, ఇతర విలువైన వస్తువులు అపహరించుకుపోయారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. రఘునందన్‌రావు ఇటీవలనే ఇంటికి తాళం వేసి కుటుంబంతో అమెరికా వెళ్లాడు. శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఇంటి ఆవరణలోకి ప్రవేశించిన ముసుగువేసుకున్న నిందితుడు సీసీకెమెరాను పక్కకు జరిపి. ఇంటితాళలు పగులగొట్టి లోపల బీరువా తెరచి, పడక గదిలోని సామగ్రిని చిందరవందర చేసి విలువైన వస్తువులను ఎత్తుకుపోయాడు. 2 తులాల బంగారం, 10 వేల నగదు, యాపిల్ కంపెనీ వాచ్, టాబ్, ఇతర వస్తువులు చోరీకి గురయ్యాయని బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు.

వేర్వేరు చోట్ల తహసీల్దార్ ఎదుట బైండోవర్

మంథని, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గతంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసిన పలువురిని మంథని తహసీల్దార్ రాజయ్య ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ రమేష్ శుక్రవారం తెలిపారు. మంథనికి చెందిన రాచర్ల రమేష్, వేముల మహేష్, భీమినేని రాజేష్, బుద్దార్తి సమ్మయ్య, కాసు రాజ్‌కుమార్‌లు ప్రభుత్వానికి చెందిన పీడీఎస్ రైస్ కొని అక్రమంగా గతంలో తరలించారని తెలిపారు. వీరిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

ముత్తారంలో నాటు సారా విక్రయదారులు..

ముత్తారం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో నాటుసారా తయారీ, విక్రయదారులను తహసీల్దార్ ఎదుట ఎక్సైజ్ అధికారులు బైండోవర్ చేశారు. అడవి శ్రీరాంపూర్, ముత్తారం, రామకృష్ణాపూర్, మచ్చుపేట, కేశనపల్లి, హరిపురం తదితర గ్రామాల్లో ఎక్సైజ్ పోలీస్ అధికారులు తనిఖీలు నిర్వహించి విక్రయదారులను అరెస్ట్ చేసి తహసీల్దార్ ఎదుట శుక్రవారం బైండో వర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఏడాది కాలానికి లక్ష రూపాయల పూచీ కత్తుతో బైండోవర్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆబ్కారీ ఎస్ఐ సాయి కుమార్, సిబ్బంది రాజేందర్, మహేందర్, రఘు పాల్గొన్నారు.

పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు

శంకరపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవ పట్నంలో బ్లూకోల్ట్స్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశవపట్నం గ్రామానికి చెందిన గొల్లెన శ్రీనివాస్ ఈ నెల 24న రాత్రి 9:30గంటలకు తన ఇంటి వద్ద గొడవ జరుగుతుందని డయల్ 100కు కాల్ చేశాడు. డ్యూటీలో ఉన్న బ్లూకోల్ట్స్ సిబ్బంది అక్కడికి వెళ్లి విచారణ చేస్తూ వీడియో చిత్రీకరిస్తున్నారు. ఈ క్రమంలో గొల్లెన శ్రీనివాస్, అతడి అల్లుడు బొజ్జ పవన్ బ్లూకోల్ట్స్ సిబ్బందిని దూషిస్తూ అడ్డుకున్నారు. దీంతో విధులకు ఆటంకం కలిగించి ఇబ్బందులకు గురిచేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లెన శ్రీనివాస్, బొజ్జ పవన్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

వేలేరు పోలీసుల అదుపులో యువకులు

హుజూరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఇద్దరు యువకులను హనుమకొండ జిల్లా వేలేరు మండల పోలీసులు శుక్రవారం తెల్లవారు జామున అదుపులోకి తీసుకున్న సంఘటన చోటు చేసుకుంది. హుజూరాబాద్ పట్టణంలోని మారుతిన గర్‌కు చెందిన తేజ(కిట్టు)తో పాటు వెంకటేష్ అనే ఇద్దరు యువకులకు గంజాయి విక్రయదారులతో సంబంధాలు ఉన్నాయని వేలేరు పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. గతంలో వెంకటేష్ గంజాయి విక్రయిస్తూ వరంగల్ జిల్లాలో పట్టుబడ్డాడు. వెంకటేష్ స్నేహితుడు తేజ కావడంతో అతనికి కూడా సంబంధాలు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో సమగ్ర విచారణకు ఇద్దరు యువకులను మహారాష్ట్ర నంబరు కలిగిన వాహనంలో తీసుకెళ్లడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై టౌన్ సీఐ తిరుమ ల్‌గౌడ్‌ను వివరణ కోరగా ఆ ఇద్దరు యువకుల తరలింపుపై ఆరా తీయగా హనుమకొండ జిల్లా వేలేరు పోలీసులు తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ విషయం వారి తల్లిదండ్రులకు వివరించినట్లు తెలిపారు.

ఇసుక లారీల పట్టివేత

కథలాపూర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్ళపల్లి శివారులోని పెద్దవాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్, తహీల్దార్ వినోద్ తెలిపారు. ఆర్మూర్ నుంచి వచ్చిన లారీలు ఇసుకను తరలిస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో రెవెన్యూ, పోలీసు సిబ్బంది దాడులు చేశారు. గురువారం అర్ధరాత్రి ఇసుకను తోడుతున్నట్లు సమాచారం మేరకు రెండు లారీలపై కేసు నమోదు చేశామని తెలిపారు.

ఎలక్ట్రిక్ క్రేజ్

మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాలకు క్రేజ్ పెరిగిపోతోంది. పెట్రోల్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు ఈజీ డ్రైవ్‌కు ఎలక్ట్రిక్ వాహనాలు అనుకూలంగా ఉండటంతో మహిళలు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. సిటీ పరిధిలో ప్రయాణం చేసేవారు ఈ-బైక్స్‌పై ఆసక్తి చూపుతున్నారు. తక్కువ ప్రయాణ ఖర్చుతో పాటు మెయింటనెన్స్ ఖర్చు తక్కువగా ఉండటంతో వాహనాల కొనుగోలు వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ-బైక్స్ మూడు యూనిట్ల కరెంట్‌తో 30 నుంచి 60 కిలోమీటర్ల వరకు ప్రయాణించే అవకాశం ఉంది.


జగిత్యాలలో విక్రయానికి సిద్ధంగా ఉన్న ఈ బైక్స్

- పెరుగుతున్న ఈ-బైక్స్
- ఆసక్తి చూపుతున్న అన్ని వర్గాల ప్రజలు

జగిత్యాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ పెరిగింది. రోజు రోజుకు ఈ-బైక్స్ కొనుగోళ్లు పెరుగుతున్నాయి. కొత్త వాహనాలు కొనుగోలు చేయాలనుకునే చాలా మంది వీటిపై మక్కువ చూపుతున్నారు. జిల్లా కేంద్రమైన జగిత్యాలలోనే కాకుండా ప్రధాన పట్టణాలయిన కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురితో పాటు పలు మండల కేంద్రాల్లో ఎలక్ట్రిక్ బైక్ షోరూంలు వెలిశాయి.

పెరుగుతున్న విక్రయాలు

జగిత్యాల జిల్లాలో సంవత్సరానికి సుమారు పది వేలకు పైగా బైకులు అమ్ముడు పోతున్నాయన్న అంచనా ఉంది. జిల్లాలో ప్రస్తుతం పెట్రోల్‌తో నడిచే బైకులు సుమారు 80 వేల వరకు ఉన్నట్లు అధికారుల రికార్డులు చెబుతుండగా, నిత్యం 40నుంచి 50వరకు వరకు వెహికల్స్ రిజిస్ట్రేషన్ కోసం క్యూ కడుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో అయిదు వేలకు పైగా ఈబైక్స్ ఉండగా ఈ మధ్యకాలంలో నెలకు సుమారు 800 నుంచి 1000 వరకు ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు జరుగుతున్నాయన్న అంచనా ఉంది. గతంతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాల సేల్స్ పెరిగాయి.



ఈ-బైక్స్ వినియోగిస్తున్న వాహన చోదకులు

కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ

కాలుష్యాన్ని నియంత్రించి ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలనే ఉద్దేశంతో ఇది వరకు కేంద్ర ప్రభుత్వం ఫేమ్ ఇండియా స్కీం వన్, టూ ఫేజ్ కింద కిలో వాట్‌కు రూ. 10 వేల చొప్పున సబ్సిడీలు కూడా అందించింది. దీంతో చాలా మంది ఎలక్ట్రిక్ వెహికల్స్ వైపు మొగ్గు చూపగా, ఇటీవల కాలంలో ఆ ప్రభా వం ఇంకాస్త ఎక్కువైంది. రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ సదుపాయం కల్పించడం, ఈ బైక్ 3 యూనిట్ల కరెంట్‌తోనే 30 నుంచి 60 కిలోమీటర్ల వరకు ప్రయాణించే అవకాశం ఉండటంతో చాలామంది ఈ వాహ నాలనే కొనేందుకు మొగ్గు చూపుతున్నారు. కొన్ని కంపెనీలు స్కూటీతో స్పోర్ట్స్ బైక్ మోడ ల్స్‌ను కూడా ఇంట్రడ్యూస్ చేయడంతో మరింత క్రేజ్ వచ్చింది.

ఈ- రిక్షాల వైపు సైతం..

ఎలక్ట్రిక్ బైకుల ఇప్పటికే జనాల్లోకి వెళ్లిపోగా ఆటోలు, కూడా ఇప్పుడిప్పుడే పెరుగుతున్నాయి. జిల్లాలో సుమారు రెండు వేలకు పైగా ఆటో రిక్షాలు ఉండగా, ఈ - రిక్షాలకు కూడా డిమాండ్ పెరుగుతోంది. ఆటోలో8 యూనిట్ల కరెంట్‌తోనే 150 కిలోమీటర్లు పైగా ప్రయాణించే అవకాశం ఉండడంతో చాలామంది డీజిల్ బండ్లను వదిలి ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పుడిప్పుడే ఎలక్ట్రిక్ ఆటోల అమ్మకాలు పెరుగుతుండగా, అన్ని కంపెనీలు కలిసి నెలకు సుమారు పదికి పైగా సేల్ చేస్తున్నట్లు డీలర్స్ చెబుతున్నారు. మున్ముందు ఎలక్ట్రిక్ ఆటోల సేల్స్ మరింత పెరిగే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఈ-బైక్‌ల వినియోగం పెరుగుతున్నాయి...



గతంతో పోలిస్తే ఇటీవలి కాలంలో ఎలక్ట్రిక్ వెహికల్స్ వినియోగం సంఖ్య పెరిగింది. జగిత్యాల పట్టణంతో పాటు పలు ప్రాంతాల్లో నిత్యం వంద వరకు బైక్‌లు అమ్ముడు పోతున్నాయి. రిజిస్ట్రేషన్ అయ్యే వాహనాలకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఎలక్ట్రికల్ స్కీం కింద రూ. 10 వేల రకు సబ్సిడీ అందిస్తోంది.

- గంటెడి వినయ్ కుమార్

పెట్రోలు బాధలు తప్పాయి



ఎలక్ట్రిక్ వాహనం కొనుగోలు చేసి సుమారు నాలుగు నెలలు అవుతోంది. పెట్రోలు బాధలు తప్పాయి. ఇటీవల కాలంలో అనేక మంది ఈ-వెహికల్స్ పట్ల మొగ్గు చూపుతున్నారు. ప్రయాణం సైతం సౌకర్యవంతంగా ఉంటోంది. లగేజీ తీసుకువెళ్లడానికి సైతం వీలుగా ఉంది. రాత్రి సమయంలో చార్జింగ్ పెడుతున్నాను. దినమంతా వినియోగించుకోవడానికి వీలుఅవుతోంది.

- బట్టు ప్రవీణ్, వాహన చోదకుడు, జగిత్యాల

న్యూస్ బాక్స్

నవంబరు 5 నుంచి బీఈడ్ రెండో సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్‌యూ పరిధిలోని బీఏ డ్ రెండో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 5 నుంచి ప్రారంభం అవుతాయని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలి పారు. పరీక్షలను మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం www.sata vahana. ac.in వెబ్‌సైట్ సందర్శించాలని పరీక్షల నియంత్రణాధికారి సూచించారు.

ఫార్మసీ కళాశాలను సందర్శించిన వీసీ

గణేశ్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం ఎల్ ఎండీ క్యాంపస్ లోగల ఫార్మసీ కళాశాలను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యు ఉమేష్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీశైలం, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై కిషోర్ వీసీకి స్వాగతం పలికారు. అనంతరం క్యాంపస్‌లో గల వివిధ భవనాలను వీసీ పరిశీలించారు. ప్రిన్సిపాల్, సిబ్బందితో పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులకు, వసతి గృహాలకు నూతన భవనాలు, క్యాంపస్ స్థలానికి ప్రహరీ నిర్మించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

29న హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 25: ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న కొత్తపల్లిలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో ఉమ్మడి జిల్లాస్థాయి సబ్‌జూనియర్ బాలికల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు నవంబరు 2 నుంచి 4 వరకు ఆసిఫాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ ప్రతంతో ఉదయం 10 గంటలకు సంయుక్త కార్యదర్శి ఎన్ ప్రభాకర్, హ్యాండ్‌బాల్ కోచ్ మూల వెంకటేశ్, పీఈటీ శ్రీధర్‌కు రిపోర్టు చేయాలని కోరారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వివరాలకు 9441925807 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. జగిత్యాల జిల్లా వెల్లుల్ల గ్రామ శివారులో శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దురు మృతి చెందారు. జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ వృద్దుడు., పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ, ఎఫ్‌సీఐ రహదారిలో జరిగిన ప్రమాదంలో యువకుడు మృతి చెందారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ: ఇద్దరి దుర్మరణం

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా వెల్లుల్ల గ్రామ శివారులో శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దురు మృతి చెందారు. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మెట్‌పల్లి మండలంలోని బండలింగాపూర్ గ్రామానికి చెందిన పోతుగంటి శ్రీనివాస్(45) మేనల్లుడైన నివాస్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై శుక్రవారం రాయికల్‌లో ఓ శుభకార్యానికి వెళ్లి స్వగ్రామానికి తిరుగుముఖం పట్టారు. అదే సమయంలో మెట్‌పల్లికి చెందిన దగ్గుల స్వామి(55) వెల్లుల్లలో ఉన్న తల్లిని కలిసి వస్తున్నాడు. ఈ క్రమంలో వెల్లుల్ల గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో వీరి వాహనాలు ఢీకొనడంతో పోతుగంటి శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. నివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దగ్గుల స్వామికి తలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను మెట్‌పల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు దగ్గుల స్వామిని నిజామాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. పోతుగంటి శ్రీనివాస్‌కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. దగ్గుల స్వామికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైపాస్ రోడ్డుపై ..

జగిత్యాల క్రైం, అక్టోబరు 25 (ఆంధ్ర జ్యోతి): జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రహ దారిలో ఎదురె దురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ వృద్ధుడు శుక్రవారం మృతి చెందాడు. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన మనోజ్ కుమార్ (63) అనే వృద్ధుడు తన ద్విచక్ర వాహ నంపై జగిత్యాల నుంచి గొల్లపల్లి వైపు వెళుతున్నాడు. గొల్లపల్లి నుంచి ప్రవీణ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై జగిత్యాలకు వస్తున్న క్రమంలో గొల్లపల్లి బైపాస్ సమీపంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. తీవ్ర గాయాలైన మనోజ్‌కుమార్ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు..

జ్యోతినగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ, ఎఫ్‌సీఐ రహదారిలోని ఆర్‌ఆర్ గార్డెన్స్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సరిపురం వంశీ(28) అనే యువకుడు దుర్మరణం చెందాడు. ఎన్టీపీసీ నుంచి గోదావరిఖనికి వెళ్తున్న క్రమంలో ఆర్‌ఆర్ గార్డెన్స్ సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడిని వంశీకి తలకు, ఇతర చోట్ల బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. బైక్ నడిపిన సాయిసతీష్ తీవ్రంగా గాయపడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఎస్ఐ కె.సతీష్ తెలిపారు.


వెల్లుల్ల శివారులో ఢీకొన్న బైక్‌లు



మృతి చెందిన శ్రీనివాస్, స్వామి(ఫైల్)

స్వీట్ మెమొరీ..

- జ్ఞాపికల తయారీతో స్వయం ఉపాధి

గణేశ్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సందర్భం ఏదైనా.. మనం ఆత్మీయులకు అందించే జ్ఞాపికలు కలకాలం నిలిచిపోతాయి. అలాంటి జ్ఞాపికల తయారీలో తనదైన ముద్రను వేస్తున్నారు కరీంనగర్‌కు చెందిన దూడం తిరుపతి. ఏడో తరగతి వరకు చదువుకున్నా జ్ఞాపికల తయారీలో పట్టు సాధించాడు. 2011లో లతా గ్రాఫిక్స్ పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేసుకుని మెమొంటోలు తయారు చేస్తూ పలువురికి ఉపాధి కల్పిస్తున్నాడు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్తకొత్త డిజైన్లలో మెమొంటోలు తయారు చేస్తున్నాడు. ఇందుకోసం కంప్యూటర్‌పై అవగాహన పెంచుకున్నాడు. తనకవసరమైన డిజైన్లను కంప్యూటర్‌పై రూపొందించి మెమొంటోలు తయారు చేస్తాడు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు సంస్థలకు ఆయన అందమైన మెమొంటోస్ తయారు చేసి ఇచ్చాడు. వుడ్ కటింగ్ మెమొంటోలు, క్రిస్టల్, డిజిటల్ మెమొంటోలు, యోగ్యతాపత్రాలు, సన్మాన పత్రాలు ఆయన తయారు చేస్తున్నాడు. మెమెంటోలు ఆయా డిజైన్లను బట్టి 50 నుంచి ఐదు వేల రూపాయల వరకు ధర ఉంటుంది. జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు తిరుపతి తయారుచేసిన జ్ఞాపికలనే అందించాడు.


మెమెంటోలను తయారు చేస్తున్న దూడం తిరుపతి


కంప్యూటర్‌లో మెమెంటోలను డిజైన్ చేస్తున్న తిరుపతి

- ప్రభుత్వం ప్రోత్సహిస్తే యువతకు శిక్షణ ఇస్తా..



ఎంతో మంది నిరుద్యోగ యువత ఉపాధిలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం మాలాంటి వాళ్లకు ప్రోత్సాహం అందిస్తే యువతకు జ్ఞాపికల తయారీ రంగంలో ప్రత్యేక శిక్షణను అందించడానికి సిద్ధంగా ఉన్నాం.

- దూడం తిరుపతి

వానరాల మృత్యువాత


కోతుల కళేబరాలను తరలిస్తున్న సిబ్బంది

వేములవాడ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి గ్రామ శివారులో శుక్రవారం వానరాలు మృత్యువాత పడ్డాయి. వేములవాడ విలీన గ్రామమైన ఆరో వార్డు శాంతినగర్ సమీపంలోని ఓ చెట్ల పొదల్లో 50 కోతులను మృతి చెంది కనిపించాయి. గుర్తు తెలియన దుర్మార్గులు విషప్రయోగం చేసి కోతులను చంపినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. విచారణ చేసి బాధ్యులను శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కోతుల కళేబరాలను మున్సిపల్ సిబ్బంది డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ సంఘటనపై వేములవాడ పోలీసులను వివరణ కోరగా ఈ సంఘటనపై విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

- అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించిన కేటీఆర్


వివరాలు తెలుసుకుంటున్న కేటీఆర్

తంగళ్లపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన సామంతుల రమేష్, నర్సింహుల పల్లె గ్రామానికి చెందిన వేల్పుల సంజీవ్ ద్విచక్ర వాహనంపై సిరిసిల్ల వైపు వెళ్తున్నారు. వెనక నుంచి వచ్చి కారు ఢీ కొట్టింది. దీంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సిరిసిల్లలో పలు కార్యక్రమంలో పాల్గొని హైదరాబాద్ వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు ప్రమాదాన్ని చూసి వివరాలు అడిగి తెసుకున్నారు. 108 వాహనాలకు ఫోన్ చేయడం తోపాటు క్షతగాత్రులకు ధైర్యం చెప్పారు. గాయపడ్డ వారిని 108లో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి 'మోనిహార' ఎంపిక



వారాల అన్వేష్

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన ప్రస్తుతం హైదరాబాద్‌లో సినిమా రంగంలో ఉన్న వారాల అన్వేష్ అనే యువకుడు డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీగా రూపొందించిన 'మోనిహార' 55వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి ఎంపికైంది. ఈ మేరకు కేంద్ర సమాచార ప్రసారాల శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నవంబరు 20 నుచి 28 వరకు గోవాలో నిర్వహించే 55వ ఇఫీ (ఐఎఫ్ఎఫ్ఐ) చలనచిత్రోత్సవంలో వివిధ భారతీయ భాషల్లోంచి వచ్చిన నాన్ ఫీచర్ సినిమాల ఎంపికలో 'మోనిహార' ఒకటి. ఈ చిత్రం బెంగాలి భాషలో నిర్మించారు. కోల్‌కత్తాలోని సత్యజిత్‌రే ఫిలిం ఇనిస్టిట్యూట్‌లో అన్వేష్ సినిమాటోగ్రఫీలో పీజీ కోర్సు పూర్తి చేశారు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగోర్ రాసిన 'మోనిహార' కథ ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. ఈ చిత్రానికి సుభాదీప్ బిస్వామి దర్శకత్వం వహించారు. అన్వేష్‌కు పలువురు సినిమా, లఘుచిత్ర రంగ బాధ్యులు నటులు తదితరులు అభినందించారు.

కబడ్డీ పోటీల్లో ఎస్సారార్‌కు ద్వితీయ స్థానం

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీలో నిర్వహించిన అంతర కళాశాలల కబడ్డీ పోటీల్లో ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించారు. అలాగే అంతర విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలకు క ళాశాల విద్యార్థులు సంజయ్, మనీంద్ర, ఎండీ అజహర్‌లు ఎంపికయ్యారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రామకృష్ణ, పీడీ నాగేశ్వర్‌రావు, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ టి రాజయ్య, అధ్యాపకుడు సత్యప్రకాశ్, తదితరులు అభినందించారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



రైల్వే స్టేషన్‌లో నిరసన తెలియజేస్తున్న వైఎఫ్ఐ జిల్లా నాయకులు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖలో ఖాళీ పోస్టులను రిటైర్డ్ ఉద్యోగులతో భర్తీ చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం నగర శివారులోని రైల్వే స్టేషన్‌లో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేలో సిబ్బంది కొరత ఉందని, సుమారు 25వేల ఉద్యోగాలను రిటైర్డ్ ఉద్యోగులతో భర్తీ చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం సిగ్గుచేటని విమర్శించారు. దేశంలో ఉద్యోగాలు రాక నిరుద్యోగ యువత కుటుంబ పోషణ భారమై ఆత్మ బలిదానాలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత స్థాయి చదువులు చదివి తీర సమయానికి ఉద్యోగాలు రాక నిరాశకు గురైన యువతకు రైల్వే శాఖ ఉద్యోగాలలో నోటిఫికేషన్ విడుదల చేసి ఉద్యోగాల భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు జావిడ్ హుస్సేన్, కృపాల్ సింగ్, రాజు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

రామగుండంలో స్ర్కాప్ చోరీపై విజిలెన్స్ విచారణ

కోల్‌సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని స్ర్కాప్ చోరీపై విజిలెన్స్ విచారణ జరుగుతుంది. శుక్రవారం కరీంనగర్‌లో విజిలెన్స్ అధికారులు రామగుండం నగరపాలక సంస్థలో పని చేసిన పలువురు అధికారులను విచారించారు. స్ర్కాప్ చోరీ ఘటనపై ఎఫ్ఐఆర్‌తో పాటు ఇప్పటికే నమోదు చేసిన పలువురు స్టేట్‌మెంట్ల ఆధారంగా అధికారులను విచారించారు. ఏయే అధికారులు స్ర్కాప్‌కు కస్టోడియన్‌గా ఉన్నారు, ఏ రోజు చోరీ జరిగింది. ఎంత మొత్తంలో చోరీ జరిగిందనే కోణంలో విచారణ జరిపారు. కార్పొరేషన్ ఉన్నతాధికారులతో పాటు ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, పారిశుధ్య విభాగాలకు చెందిన ఆరుగురు అధికారులను విచారించినట్టు సమాచారం. స్ర్కాప్ చోరీ రామగుండంలో తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. కొందరు ప్రజా ప్రతినిధుల ప్రమేయం ప్రస్ఫుటమయ్యింది. ఇటీవల పోలీస్ ఉన్నతాధికారులు కూడా ఈ కేసు పెండింగ్ గురించి ఆరా తీశారు. ఇదే సమయంలో విజిలెన్స్ విచారణ, వివిధ విభాగాలకు చెందిన అధికారులను పిలిపించడం తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. కాగా, రామగుండం పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జరిగిన చోరీ ఘటనలో కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారులు బలిపశువులయ్యారనే ప్రచారం జరుగుతోంది. అప్పటి కమిషనర్ శంకర్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే సమయంలో నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి పలువురు టౌన్ ప్లానింగ్ అధికారులను కస్టోడియన్లుగా పేర్కొన్నట్టు సమాచారం. పోలీస్‌శాఖ నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా టౌన్ ప్లానింగ్ అధికారులకు విజిలెన్స్ నోటీసులు ఇచ్చింది. కాగా ఈ ఘటనలో పూర్తి విచారణ జరపాలని పలువురు అధికారులు పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది.

ఖాదీ.. ఈ పేరు వింటేనే అందరికీ మహాత్ముడి విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమం గుర్తుకువస్తోంది. ఆ ఉద్యమంలో భాగంగా 1924లో వావిలాలలో ఖాదీ వస్త్రోత్పత్తి ప్రారంభమైంది. 1983 ప్రతిష్ఠాన్‌గా రూపొంది ఎన్నో అవార్డులు సాధించింది. ఇక్కడ తయారైన మువ్వన్నెల జెండా ఢిల్లీ ఎర్రకోటపై రెపరెపలాడింది. ఇండియన్ రైల్వేస్ తన సిబ్బంది యూనిఫామ్స్‌కు ఇక్కడ రూపొందించిన వస్త్రాలనే ఉపయోగిస్తోంది. రెడీమేడ్ దుస్తుల జోరులోనూ వావిలాల ఖాదీ వస్త్రాలు తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయి.



ఖాదీ వస్త్రాలు

వారెవ్వా.. వావిలాల ఖాదీ



రంగులు అద్ది ఆరబెట్టిన ధారం

- ఏటా కోట్లాది రూపాయల ఉత్పత్తులు
- వెయ్యి మంది కార్మికులకు ఉపాధి
- రెడిమేడ్ దుస్తులకు ధీటుగా వెరైటీ డిజైన్ల తయారీ

జమ్మికుంట రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో మొదలైన వావిలాల ఖాదీ పరిశ్రమ స్వాతంత్ర్యానంతరం వచ్చిన అనేక మార్పులకు తట్టుకుని నిలబడింది. మార్కెట్‌లో వచ్చిన పారిశ్రామిక ఉత్పత్తుల పోటీని తట్టుకుని వాటికి దీటుగా అందమైన డిజైన్లను రూపకల్పన చేస్తోంది. స్థానికంగా వేయికి పైగా కుటుంబాలకు ఉపాధినిస్తున్న వావిలాల ఖాదీ దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఖాదీ వస్త్ర ప్రియుల మన్ననలను వందేళ్లుగా పొందుతోంది.మంది ఖాదీ పి మహాత్మా గాంధీ స్ఫూర్తితో వావిలాల ఖాదీ ప్రతిష్ఠాన్‌ను ప్రారంభించారు. ఈ సంస్థ తన ప్రస్థానంలో ఎన్నో మైలు రాళ్లను అధిగమించింది. ఎర్రకోటపై రెపరెపలాడిన త్రివర్ణ పతాకం ఇక్కడి నేత కార్మికుల చేతుల మీదుగా రూపు దిద్దుకుంది. వంద సంవత్సరాల క్రితం ఏర్పాటైన ఖాదీ సంస్థ 1983లో ప్రతిష్ఠాన్‌గా రూపుదిద్దుకుంది. ఏటా కోట్లాది రూపాయాల ఉత్పత్తులను తయారు చేస్తూ వెయ్యి మందికి పైగా కార్మికులకు ఉపాధి అందిస్తోంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వెరైటీ డిజైన్ల తయారీతో రెడీమేడ్ దుస్తులకు గట్టి పోటీ ఇస్తోంది. ఇటీవలి కాలంలో యువత ఖాదీ వస్త్రాలపై మొగ్గు చూపుతుండడంతో నయా ట్రెండ్ మొదలైంది.

● 1924లో ప్రారంభం

గాంధీజీ ఇచ్చిన పిలుపు మేరకు జమ్మికుంట మండలం వావిలాల గ్రామంలో 1924లో అఖిల భారత చరకా సంఘ్‌లో భాగంగా ఖాదీ వస్త్రోత్పత్తి ప్రారంభమైంది. అన్నాసాహెబ్ సహస్ర బుద్ధే, లేలేజీ వంటి వారు ఇక్కడ ఖాదీ సంస్థను ప్రారంభించారు. 1983లో వావిలాల ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్ఠాన్‌గా ఆవిర్భవించింది. 13 ఎకరాల విస్తీర్ణంలో ఖాదీ వస్త్రాలయం ఉంది.

● కార్మికులకు నీడను ఇస్తున్న సంస్థ

ఖాదీ ప్రతిష్ఠాన్‌లో దూది నుంచి ఏకులు వడకడం మొదలు కార్పెట్లు నేసే వరకూ ప్రతి పనిని కార్మికులు వారు తయారు చేసుకున్న యంత్రాలతోనే చేస్తారు. తెలంగాణలోనే ఏకైక సింప్లెక్స్ (కార్డింగ్) మిషన్ వావిలాల ఖాదీ ప్రతిష్ఠాన్‌లో ఉంది. కోయంబత్తూర్ నుంచి ఈ మిషన్‌ను ప్రత్యేకంగా తెప్పించారు. ఇక్కడ నేసే కార్పెట్లకు మంచి గిరాకీ ఉంది. రోజుల తరబడి నలుగురు అంతకంటే ఎక్కువ మంది కార్మికులు కష్టపడితే తప్ప ఒక్క కార్పెట్ తయారవదు. మామూలు రాట్నానికి కొంత సాంకేతికతను జోడించి తయారు చేసిన సైకిల్ రాట్నాన్ని తయారు చేశారు. ఈ రాట్నం ద్వారా ఒకేసారి 16 కుదుళ్లను పెట్టి రోజుకు మహిళా కూలీ 40 చిట్టాల వరకు తయారు చేస్తుంది.

● విస్తరించిన ఉత్పత్తులు

వావిలాలలో ప్రారంభమైన ఖాదీ వస్త్రాల ఉత్పత్తి తర్వాతికాలంలో హుజూరాబాద్ మండలం రాంపూర్, వరంగల్ జిల్లా మొగుళ్లపల్లి, తొర్రూర్ మండల కేంద్రాల్లో మొదలయ్యింది. ఆయా కేంద్రాల్లో తయారు చేసిన వివిధ రకాల వస్త్రాలను వావిలాలకు తరలించి అక్కడి నుంచి మర్కెటింగ్ కేంద్రాలకు పంపుతున్నారు. ఇండియన్ రైల్వేస్ తమ యూనిఫామ్స్‌కు వావిలాల ఖాదీ వస్త్రాలనే ఉపయోగిస్తోంది. ముంబై, ఢిల్లీ, కేరళ, చెన్నై ఖాదీ కమిషన్లు ఇక్కడి ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నాయి. కోల్‌కతా, నాగ్‌పూర్, కోయంబత్తూరు, బెంగళూరు, అహ్మదాబాద్, మధురై నగరాలకు ఇక్కడి ఉత్పత్తులు సరఫరా అవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు మార్కెటింగ్ కేంద్రాల ద్వారా ఖాదీ ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. యేటా నాలుగు ఉత్పత్తి కేంద్రాల ద్వారా నాలుగు కోట్ల పైచిలుకు విలువైన వస్త్రాలు ఉత్పత్తి చేస్తున్నారు. విక్రయ కేంద్రాల ద్వారా ఖాదీ వస్త్రాలతో పాటు తేనె, శాండల్ పౌడర్, సబ్బులు, అగర్‌బత్తీలు, గిఫ్ట్ ఆర్టికల్స్ విక్రయిస్తున్నారు. సూటింగ్స్, షర్టింగ్స్, చద్దర్లు, కార్పెట్లు, టవల్స్, లుంగీలు, చీరలు, ఖర్చీఫ్స్, తదితర ఖాదీ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

● వస్త్రాల తయారీ ఇలా...



కర్ణాటకలోని చిత్రదుర్గ ఖాదీ కమిషన్ నుంచి వావిలాల ఖాదీ ప్రతిష్ఠాన్ శుద్ధి చేసిన దూదిని కొనుగోలు చేస్తుంది. సింప్లెక్స్, డ్రాయింగ్ మిషన్లతో ఏకులు వడికి, వాటిని 8, 16 కుదుళ్ల రాట్నాలపై కార్మికులతో వడికిస్తారు. ఇలా తయారైన దారానికి అవ సరం మేరకు రంగులు అద్దుతారు. ఈ దా రాన్ని వార్పింగ్ యంత్రాలపై భీములు తయారు చేసి నేత కోసం కార్మికులకు అందజేస్తారు. కార్మికులు నేసిన వస్త్రాన్ని బ్లీచింగ్ పౌడర్ కలిపిన నీటిలో రెండు రోజు ల పాటు ఉంచి స్టార్చ్, నీలి, కినోపాల్ మిశ్రమంతో కలిపి ఆరేస్తారు. దానిని ఇస్త్రీ చేసి మీటర్ చొప్పున ఫోల్డింగ్ చేస్తారు. చివరగా కార్మికులు వస్త్రాలపై పోగులు తొలగించి అమ్మకం కోసం పంపుతారు.

● ఆటుపోట్లు ఎదురైనా..

ఐఎస్‌వో 9000 సర్టిఫైడ్ కంపెనీ అయిన వావిలాల ఖాదీ ప్రతిష్ఠాన్ అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూనే మార్కెట్‌లో నిలబడుతోంది. ఖాదీ వస్త్రాల ఉత్పత్తిపై కేంద్ర ప్రభుత్వం 20 శాతం ప్రోత్సాహకంగా ఇస్తుండగా, అంతే మొత్తాన్ని ఖాదీ ప్రతిష్ఠాన్ తమ అమ్మకాలపై వినియోగదారులకు రాయితీగా అందజేస్తోంది. కేంద్రం ఇచ్చే ప్రోత్సాహకానికి తోడు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో 20శాతం రిబేట్, ఇన్స్‌రెన్స్, పెన్షన్, సంస్థకు డిస్కౌంట్లు ఇస్తే ఖాదీ మరింత వృద్ధి చెందే అవకాశం ఉంది

● ఎర్రకోటపై రెపరెప లాడిన వావిలాల జెండా

వావిలాల ఖాదీ ఢిల్లీ ఎర్రకోటపై రెపరెపలాడింది. 1989 ఆగస్టు 15న అప్పటి భారత ప్రధాని రాజీవ్‌గాంధీ ఎర్రకోటపై వావిలాల ఖాదీ నుంచి పంపిన మువ్వన్నెల జెండాను ఎగురువేశారు.

● ఖాదీ వస్త్రాలపై యువత ఆసక్తి

రెడిమెడ్ వస్త్రాలకు దీటుగా ఖాదీ సంస్థ వెరైటీ డిజైన్లతో వస్త్రాల ఉత్పత్తి చేస్తుండడంతో యువత ఆసిక్తి కనబరుస్తుంది. వావిలాల ఖాదీలో వస్త్రాలు కొనుగోలు చేసేందుకు సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారు.



ధారం తయారీ యంత్రం



వెరైటీ డిజైన్ల వస్త్రాలు

న్యూస్ బాక్స్

రేపు సికింద్రాబాద్ సదర్

కరీంనగర్ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ స్టేడియంలో ఆదివారం సికింద్రాబాద్ మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సికింద్రాబాద్ సదర్ మహోత్సవాల కరపత్రాన్ని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమ పోరాట యోధుడు రాజారాం యాదవ్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేటర్ జంగిలి ఐలేందర్‌యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు నాగారపు సత్యనారాయణ యాదవ్‌తో కలిసి ఆవిష్కరించారు. శుక్రవారం కోర్టు సమీపంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మంచాల రవీందర్‌యాదవ్, కాల్వ మల్లేశం యాదవ్, కొత్తపల్లి మండల అధ్యక్షుడు పరుశరామ్ యాదవ్, కరీంనగర్ అధ్యక్షుడు సాయవేణి రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సికింద్రాబాద్ సదర్ మహోత్స వాలకు జిల్లాలోని యాదవ ప్రజాప్రతినిధులు, నాయకులు, యాదవ సంఘం జిల్లా, మండల కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, బాధ్యులు, యాదవ సంఘ ప్రముఖులు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.

రెండిళ్లలో చోరీ

కరీంనగర్ క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని రెండిళ్లలో చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. రాంనగర్ రోడ్డు నెంబర్ 8లో నివాసం ఉంటున్న కూర కిషన్ స్టాంప్ వెండర్‌గా పనిచేస్తున్నాడు. తన ఇంటికి తాళం వేసి గురువారం రాత్రి నగరంలోని కుమార్తె ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉండటాన్ని గుర్తించారు. ఇంట్లో నిల్వ ఉ న్న రూ. 20వేల విలువగల స్టాంప్ పేప ర్స్ రూ.50వేల నగదు చోరీకి గురైనట్లు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● వన్‌టౌన్ పరిధిలోని వినాయకనగర్ రోడ్డు నంబర్ 4లో నివాసం ఉంటున్న కాట రమేష్ వ్యాపారం చేస్తున్నాడు. అతని సోదరుడు మృతి చెందటంతో మానకొండూర్ మండలం కెల్లెడకు వెళ్లి శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. ఇంట్లో బీరువా పగలగొట్టి ఉండటాన్ని గుర్తించాడు. అందులో ఉన్న వస్తువులు కిందపడేసి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించగా సీఐ కోటేశ్వర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇంట్లో బీరువాలో ఉంచిన 4.5 తలాల బంగారం, 10 తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

నేడు బీడీ కార్మికుల మహాసభ

మల్యాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండల కేంద్రంలో శనివారం బీడీ కార్మికు జగిత్యాల జిల్లా రెండో మహాసభ నిర్వహిస్తున్నామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొక్కుల శాంత, సుతారి రాములు కోరారు. స్థానికంగా శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండ గట్టేందుకు ఈ మహాసభ నిర్వహి స్తున్నామని చెప్పారు. బీడీ కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథం, ముత్రం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయంపై రైతుల ఆశలు

● గెలలు వేసిన ఆయిల్ పామ్ చెట్లు.. ● మూడేళ్ల శ్రమకు దక్కనున్న ప్రతిఫలం ● మరో 4 నెలల్లో అమ్మకాలు షురూ..

జిల్లాలోని ఆయిల్‌పామ్ రైతులు ఆదాయంపై ఆశలు పెంచుకుంటున్నారు. మూడేళ్ల క్రితం తాము నాటిన ఆయిల్ పామ్ చెట్లు కాపుకొచ్చాయి.. చెట్లకున్న గెలలను చూసి రైతులు ఆదాయాన్ని అంచానా వేస్తున్నారు. మరో మూడు నెలల్లో మార్కెట్‌లో పంటను విక్రయించే అవకాశాలున్నాయి.



ఆయిల్‌పామ్స్ తోటలు



ఆయిల్‌పామ్ కాయలు



గెలలు వేసిన ఆయిల్‌పామ్ చెట్టు

మంథని/ముత్తారం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల క్రితం సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటలు మొదటి సారి కాపునకు వచ్చాయి. ప్రస్తుతం చాలా చోట్ల చెట్లకు కాయల గెలలు వేశాయి. దీంతో తొలి దశలో ఎకరాకు 3-5 టన్నులు దిగుబడి వస్తుందని అధి కారులు అంచనా వేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల ప్రోత్సాహంతో జిల్లాలో మూడేళ్ల క్రితం మలే షియా, సింగపూర్ నుంచి బ్రీడ్ తెచ్చి నాటిన ఆయిల్ పామ్ తోటల్లో కాపు (గెలలు వేయడం) ప్రారంభమైంది. జిల్లాలోని ఉద్యానవశాఖ అధికారులు ఖమ్మం జిల్లా అశ్వరావుపేట నుంచి తేనెటీగలు (వీవిల్స్) తెప్పించి ఆయిల్‌పామ్ మొగ్గలను ఫలదీకరణం చెందించడంతో గెలల సంఖ్య బాగా పెరిగింది. ఒక్కో మొక్కకు ఆరు నుంచి 10 గెలలు వేయగా, మరో నాలుగు నెలల్లో తొలి పంట కోతకు రానుంది.

● జిల్లాలో 2.393 వేల ఎకరాల్లో సాగు..

జిల్లాలోని 14 మండలాల్లో 938 మందికి పైగా రైతులు సుమారు 2,393వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు సాగుచేశారు. మంథని డివిజన్లో మంథని, రామగిరి, ముత్తారం, కమాన్‌పూర్ మండలాల్లో 324 మంది రైతులు 855 ఎకరాల్లో సాగు చేశారు. ఆయిల్‌పామ్ చెట్లు నాటిన ఏడాదినుంచి గెలలు వేయగా, అధికా రుల సూచనల మేరకు రైతులు మొదటి రెండు సంవత్సరాలు వాటిని తీసేసి, మూడో సంవత్సరం ప్రారంభం నుంచి మంచి దిగుబడి కోసం ఎదురుచూస్తున్నారు. ఎకరాకు 10 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం టన్నుకు మార్కెట్లో రూ.18 వేలు ధర పలుకుతోంది.

దీర్ఘకాలిక ప్రయోజనం పొందవచ్చు..



ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుంది. నీటి సౌకర్యం కలిగిన భూముల్లో ఈ పంట సాగు చేసుకోవచ్చు. ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన మూడేళ్ల అనంతరం పంట దిగుబడి ప్రారంభమవుతుంది. సుమారు మూడు దశాబ్దాల పాటు గెలలు వేయడంతో దీర్ఘకాలిక ఆదాయం పొందవచ్చు. నేను మూడు ఎకరాల్లో సాగు చేశాను. మరో నాలుగు నెలల్లో తొలిసారిగా ఆదాయం రానున్నది.

- కల్యాణపు రాయమల్లు, ముత్తారం

హుండీ లెక్కింపులో ఉద్యోగి చేతివాటం

- రూ. 2 లక్షల విలువైన నగదు కాజేసేందుకు యత్నం
- అనుమానంతో విచారించిన భద్రతా సిబ్బంది
- ఉద్యోగిని సస్పెండ్ చేసిన ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపులో ఓ ఉద్యోగి చేతివాటాన్ని ప్రదర్శించాడు. వేములవాడ రాజన్నపై ఎంతో నమ్మకంతో భక్తులు హుండీలో వేసిన కానుకలు పక్కదారి పట్టడం పట్టణంలో శుక్రవారం కలకలం రేపింది. రాజన్న ఆలయ హుండీలను గురువారం లెక్కించారు. ఈ క్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి నగదు కాజేసేందుకు యత్నించినట్లు భద్రత సిబ్బంది గుర్తించారు. హుండీ కౌంటింగ్ పూర్తయిన పిదప కౌంటింగ్ హాల్‌లో ఉద్యోగి కనిపించడంతో అనుమానం వచ్చిన భద్రత సిబ్బంది తనిఖీ చేశారు. సుమారుగా రూ.2 లక్షల నగదును కాజేసే వ్యవ హారం బయటపడింది. విషయం బయటకు పొక్కకుండా అధికారలు జాగ్రత్త పడడం చర్చనీయాంశమైంది.

- ఆలయ ఉద్యోగుల హస్తం ఉందని అనుమానాలు..

రాజన్న ఆలయ హుండీల లెక్కింపులో పలు మార్లు ఉద్యోగులు చేతివాటం ప్రదర్శించిన విషయం తెలిసిందే. అయితే రాజన్న ఆలయం లోని ఉద్యోగులు ఒక టీమ్‌గా ఏర్పాటు కావడంతోనే ఇలాంటి సంఘ టనలు జరుగుతాయని, కౌంటింగ్ హాల్ పక్కన కోడెల క్యూలైన్‌ను ఆనుకుని ఉన్న ఇనుపజాలీ సైతం సగం వరకు తొలగించి కనిపించడంతో నగదు, బంగారం, వెండి పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు వె ల్లువెత్తుతున్నాయి. హుండీ కౌంటింగ్‌లో ఆలయ ఉద్యోగులతో పాటు స్వచ్ఛంద సంస్థల భజన మండలి సభ్యులు పాల్గొంటారు. హుండీ లెక్కిం పులో సీసీ కెమెరాలు, భద్రతా సిబ్బంది తనిఖీలు చేస్తూనే ఉంటారు. ఉద్యోగుల చేతివాటం ప్రదర్శించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైన ఈ వ్యవహారంలో సీసీ కెమెరాలను పరిశీలించి విచారణ చేసి నిజానిజాలను తేల్చాలని భక్తులు, పట్టణవాసులు కోరుతున్నారు.

నగదు దొరికింది నిజమే..

రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో హుండీ లెక్కింపులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి నగదు కాజేసే యత్నం చేసింది నిజమే. అనుమానంగా కనిపించడంతో భద్రత సిబ్బంది 20 నుంచి 30 ఐదు వందల నోట్లను గుర్తించి పట్టుకున్నారు. విచారణ చేసి సదరు ఉద్యోగిని విధుల్లో నుంచి తొలగించాం. హుండీ లెక్కింపులో మరింత భద్రతను పెంచుతాం.

- ఈవో వినోద్‌రెడ్డి

న్యూస్ బాక్స్

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పది

వీర్నపల్లి, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని మాజీ సర్పంచులు గొర్రె కరుణ, రవి నాయక్ అన్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లి, సీతారాం నాయక్ తండా గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు పాఠశాల అభివృద్ధి కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి శుక్రవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి చేసిన సేవలను కొనియాడారు. స్కూల్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ బుచ్చగారి రాకేష్ గౌడ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంగళ శ్రీనివాస్, తిరుపతి జాదవ్ పాల్గొన్నారు.

మాదిగ విద్యార్థులకు నష్టం

ఇల్లంతకుంట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా మాదిగ విద్యార్థులకు నష్టం జరిగేలా ప్రభుత్వం చేస్తోందని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి మాదిగ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మాట్లాడుతూ మాలల కొమ్ము కాస్తున్న ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ చేయడానికి నిరసిస్తూ ఈనెల 27న జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగే మాదిగల ధర్మ యుద్ధ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నందున అన్ని గ్రామాల నాయకులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు నాంపల్లి, మధు, మొండయ్య, రవి, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు

ఈసీజీపై అవగాహన

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రాథమికంగా గుండె జబ్బును గుర్తించడంలో ఈసీజీ కీలక పాత్ర పోషిస్తుందని మెడికవర్ ఆసుపత్రి గుండె వైద్య నిపుణుడు డాక్టర్ అనీష్ పబ్బ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని ఓ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎంబీబీఎస్ వైద్యులకు ఈసీజీపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా గుండె వైద్య నిపుణులు డాక్టర్ అనీష్ పబ్బ మాట్లాడారు. దశాబ్దాల కాలం నుండి గుండె పని తీరును ఈసీజీ ద్వారానే నిర్ధారించడం జరుగుతుందన్నారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ హెడ్ కోట కరుణాకర్, మార్కెటింగ్ సిబ్బంది శ్రీకాంత్, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

విద్యుత్‌చార్జీల పెంపుపై భిన్న వాదనలు


సమావేశానికి హాజరైన కేటీఆర్, నాయకులు

5వ పేజీ తరువాయి

విద్యుత్ ఛార్జీలు పెంచాలని కిసాన్ సంఘ్ ప్రతినిధులు కోరారు. గత ప్రభుత్వం ఛార్జీలు పెంచకుండా ఉచితంగా విద్యుత్ సరఫరా చేయ డంతో ప్రస్తుత ప్రభుత్వంపై భారం పడిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. సిరిసిల్ల సెస్‌లో గత దీపావళి పండుగ రోజు టపాసులు కాల్చడం వల్ల ఆడిట్ జరుగుతున్న సమయంలో రికార్డులు కాలిపోయాయని పేర్కొన్నారు. పోలీ సులకు ఫిర్యాదు చేసినా దీనిపై ఇప్పటి వరకు స్పందన లేదన్నారు. సెస్‌లో కొత్త నియామకాలు చేపట్టడం లేదని కేవలం కారుణ్య నియామకా లు అనారోగ్యం పేరుతో మళ్లీ ఉద్యోగుల పిల్లలను తీసుకుంటున్నారని పలువురు ఆరోపించారు. కొత్త నియామకాలు చేపట్టాలని కోరారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు పది హెచ్‌పీల వరకు ఉచితంగా కరెంట్ ఇవ్వాలని సిరిసిల్ల పాలిస్టర్, కాటన్ పవర్‌లూం ఆసాములు కోరారు. నాలుగో కేటగిరీ పరిశ్రమలను మూడో కేటగిరీలోకి మార్చడం ద్వారా భారం పెరిగిందని పవర్‌లూం వస్త్రోత్పత్తిదారుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. 40 హెచ్‌పీల వరకు రాయితీని కొనసాగించాలని కోరారు.

విద్యుత్ సమస్యలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

విద్యుత్ సమస్యలను సెస్ అధికారులు నిర్లక్ష్యం చేస్తే విద్యుత్ నియంత్రణ మండలి అధ్వర్యంలో చర్యలు తీసుకోనున్నట్లు విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ తన్నీరు శ్రీరంగరావు అన్నారు. విద్యుత్ సమస్యలను బహిరంగంగా చెప్పుకోవడానికి విచారణను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ బహిరంగ విచారణలో ప్రజా ప్రతినిధులు, వినియోగదారులు చెప్పిన విధంగా నివేదికలను విద్యుత్ నియంత్రణ మండలి అధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. వినియోగదారులను ఇబ్బందులకు గురిచేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ కరెంట్‌ను సమస్యలను సెస్ అధికారులు నిత్యం పర్యవేక్షిం చాలన్నారు.

వస్త్ర పరిశ్రమకు విద్యుత్ రాయితీ ఇవ్వాలి

ఎల్.రమణ, ఎమ్మెల్సీ



సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు విద్యుత్ రాయితీకి సంబంధించి పది హెచ్‌పీల నుంచి 30 హెచ్‌పీలకు పెంచాలి. రాష్ట్రంలోనే అత్యధిక మరమగ్గాలు సిరిసిల్లలో ఉన్నాయి. తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సిరిసిల్ల కార్మికులకు చేతి నిండా పని కల్పించే దిశగా బతుకమ్మ చీరలు వంటి ఆర్డర్లను ఇచ్చారు. ఆర్డర్లు లేక ఈ ప్రభు త్వంలో ఇప్పటికే సిరిసిల్లలో పది మంది, ఇతర ప్రాంతాల్లో 30 మంది వరకు ఆత్మహత్య చేసుకున్నారు. వారిని అదుకునే దిశగా విద్యుత్ రాయితీని పెంచాలి.

యూనిట్ ధరలను సమీక్షించాలి

చిక్కాల రామారావు, సెస్ చైర్మన్



సిరిసిల్ల సెస్ కొనుగోలు చేసే విద్యుత్ యూనిట్ ధర రూ.4.84 నిర్ణయించారు. పాత, కొత్త ధరల మధ్య మార్గంగా నిర్ణయించాలి. సెస్ కొనుగోలు చేసే విద్యుత్ యూనిట్ ధర 2017-18 నాటికి రూ 1.03 ఉన్న దానిని 2018-19లో రూ.4.50 కి పెంచారు. ప్రస్తుతం రూ.4.84కు పెరిగింది. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కు సంబంధించి 10 హెచ్‌పీల లోడ్ పరిమితితో సరైన జీవనభృతి కలగడం లేదు. లోటు పరిమితిని 30 హెచ్‌పీలకు పెంచాలి. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు 5 హెచ్‌పీలు కాకుండా 7.5 హెచ్‌పీలకు పెంచాలి.

ముంపుగ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి

సుంకె రవిశంకర్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే



మిడ్‌మానేరు నిర్వాసితుల ఆర్ అండ్‌ఆర్ కాలనీలతో పాటు ముంపునకుగురైన గ్రామాల్లో విద్యుత్ సమస్యలను సెస్ అధికారులు పరిష్కరించాలని, నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. ఆర్ అండ్‌ఆర్ కాలనీల్లో నివాసం ఉండే నిర్వాసితులకు గృహజ్యోతి పథకాన్ని వర్తింపజేయాలి. వారికి ఉచితం గానే కరెంట్‌ను అందించేందుకు విద్యుత్ నియంత్రణ మండ లి చొరవ తీసుకోవాలి.

సబ్సిడీ తొలగింపుతో మూత పడుతున్న పరిశ్రమలు

ఆడెపు భాస్కర్, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలకు విద్యుత్ రాయితీ కల్పించాలి. సిరిసిల్లలో 35వేల 400 మరమగ్గాలు ఉండగా 5800 విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. గతంలో ఈ పరిశ్రమలను 3వ కేటగిరి కింద విద్యుత్ బిల్లులను రూ.4 చొప్పున చెల్లిండంతోపాటు 50 శాతం సబ్సిడీ అమలయ్యింది. ప్రస్తుతం 4వ కేటగిరికి మార్చి రూ.8 చొప్పు వేస్తున్నారు. సబ్సిడీని తొలగించడంతో వస్త్ర పరిశ్రమలన్ని మూతపడ్డాయి. ఉచితంగా అందిస్తున్న 10 హెచ్‌పీ విద్యుత్‌ను 40 హెచ్‌పీలకు పెంచాలి. 50 శాతం సబ్సిడీ అమలు చేయాలి.



విద్యుత్ చార్జీలను పెంచాలి

శశిభూషణ్, భారత్ కిసాన్‌సెల్ అధ్యక్షుడు



రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విద్యుత్ చార్జీలను పెంపును భారత్ కిసాన్‌సెల్ సమర్థిస్తోంది. విద్యుత్ నియంత్రణ మండల వినియోగదారుల అభిప్రాయాలను సేకరించడంతో పాటు విద్యుత్ చార్జీలను పెంచేందుకు ప్రభుత్వానికి నివేదికల ను అం దించాలి. పదేళ్లుగా ఉచిత విద్యుత్‌ను అందించడంతో ప్రస్తుత ప్రభుత్వంపై విద్యుత్ భారం పడింది. ప్రస్తు తం ప్రభుత్వానికి ఆర్థిక ఆదాయ వనరుల కొరత ఉంది. దానిని భర్తీ చేయాలంటే విద్యుత్ చార్జీలను పెంచాలి.

మరమ్మతు చేయడం లేదు

అనవేని పర్శరాములు, చంద్రంపేట



సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 12 వవార్డు చంద్రంపేటలో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని, మరమ్మతు చేయాలని సెస్ ఎండీతోపాటు చైర్మన్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. నెల రోజులు కరెంట్ లేక ట్రాన్స్‌ఫార్మర్ కింద సాగు చేసిన పత్తి పూర్తిగా ఎండిపోయింది. రైతులు తీవ్రగా నష్టపోయారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను బాగు చేయాలంటే సెస్ అధికారులు వ్యవసాయ బావులకు రూ.500 చొప్పున వసూలు చేశారు.

సెస్ టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు చేయాలి

ఓరుగంటి రామకృష్ణ,

భారత్ కిసాన్ సంఘ్ సభ్యుడు



ట్రోల్‌ఫ్రీనంబర్‌ను గ్రామాల్లో ఏర్పాటు చేయాలని విద్యుత్ నియంత్రణ మండలి అదేశాలు జారీ చేసినా స్పందన లేకుండా పోయింది. గ్రామ పంచాయతీల వద్ద సెస్ ట్రోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయించాలి. సెస్ పరిధిలో కొత్తగా విద్యుత్ మీటర్లను తీసుకుంటే కేటగిరి 2 కింద మంజూరు చేస్తున్నారు. ఇంటికి అందించే విద్యుత్ మీటర్లను కేటగిరి 1 కింద ఉండేలా చర్యలు తీసుకోవాలి. విద్యుత్ షాక్‌లతో మరణించిన వారికి అందించే నష్టపరిహారాన్ని పెంచాలి.

వీటీడీఏ పరిధిలోకి గ్రామాలు

- 11 మండలాల్లో 152 రెవెన్యూ గ్రామాలకు జీవో
- అభివృద్ధి కోసం పరిధి పెంచినట్లు ప్రభుత్వ ఉత్తర్వులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (వీటీడీఏ) పరిధి పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులను జారీ చేసింది. గతంలో వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం పరిధిలోని పట్టణంతోపాటుగా అర్బన్ మండలం వీటీడీఏ పరిధిలోకి వచ్చేవి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని సిరిసిల్ల మున్సిపాలిటీతోపాటు బోయినపల్లి మండలంలోని అనంతపల్లి, బోయినపల్లి, బూర్గుపల్లి, దుండ్రపల్లి, కొదురుపాక, కోరెం, కొత్తపేట, మల్కాపూర్, మల్లాపూర్, మానువాడ, నర్సింగాపూర్, స్తంభంపల్లి, తడగొండ, వర్ధవెల్లి, విలాసాగర్, ఇల్లంతకుంట మండలంలో అనంతగిరి, అనంతారం, దాచారం, ఇల్లంతకుంట, గాలిపెల్లి, జంగారెడ్డిపల్లి, జవారిపేట, కందికట్కూరు, ముస్కానిపేట, ఒబులాపూర్, పెద్దలింగాపూర్, పొత్తూరు, రహీంఖాన్‌పేట, రామోజిపేట, రేపాక, సిరికొండ, తాళ్లపల్లి, తిప్పాపూర్, వల్లంపట్ల, వంతడుప్పల, వెల్జిపూర్, గంబీరావుపేట మండలంలో దమ్మన్నపేట్, దేశాయిపేట్, గోరంటాల, గజశింగవరం, గంభీరావుపేట, ఖుర్దులింగంపల్లి, కోళ్లమద్ది, కొత్తపల్లి, లక్ష్మపూర్, లింగన్న పేట, మల్లారెడ్డిపేట, ముచ్చెర్ల, ముస్తాఫనగర్, నర్మల, సముద్రలింగాపూర్, శ్రీగాధ గ్రామాలు ఉన్నాయి. ముస్తాబాద్ మండలంలో అవునూర్, బందనకల్, చీకోడ్, చిప్పలపల్లి, గూడెం, గూడూరు, కొండపూర్, మద్దికుంట్ల, మోయినికుంట, మోర్రా?యిపల్లి, మోర్రాపూర్, ముస్తాబాద్, నామాపూర్, పోతుగల్, తెర్లుమద్ది గ్రామాలను, వీర్నపల్లి మండలంలో అడవిపదిర, గర్జనపల్లి, కంచెర్ల, మద్దిమల్ల, వన్‌పల్లి, వీర్నపల్లి గ్రామాలు ఎల్లారెడ్డిపేట మండలంలో అక్కపల్లి, అల్మాస్‌పూర్, బండలింగంపల్లి, బొప్పాపూర్, దుమాల, గొల్లపల్లి, గుండారం, కోరుట్లపేట, నారాయణపూర్, పదిర, పోతురెడ్డిపల్లి, రాజన్నపేట, సింగారం, తిమ్మాపూర్, వెంకటపూర్, ఎల్లారెడ్డిపేట గ్రామాలను, తంగళపల్లి మండలంలోని చీర్లవంచ, బద్దనపల్లి, బస్వాపూర్, చింతలఠాణ, గండిలచ్చపేట్, జిల్లెల, కస్బెకట్కూర్, మండెపల్లి, నర్సింహులపల్లి, నేరెళ్ల, ఒబులాపూర్, రామచంద్రాపూర్, సారంపల్లి, తాడూరు, తంగళపల్లి, వేణుగోపాల్‌పూర్ గ్రామాలు కలువగా వేములవాడ రూరల్ మండలంలో బొల్లారం, చెక్కపల్లి, ఎదురుగట్ల, ఫాజుల్‌నగర్, హన్మాజీపేట, లింగంపల్లి, మల్లారం, మర్రిపెల్లి, నూకలమర్రి, వట్టెంల, వెంకటాంపల్లి గ్రామాలు, చందుర్తి మండలంలో అనంతపల్లి, బండపల్లి, చందుర్తి, జోగాపూర్, లింగంపేట, మల్యాల, మర్రిగడ్డ, మూడపల్లి, సనుగుల, తిమ్మాపూర్, ఎన్గల్ గ్రామాలు రుద్రంగి మండలంలో రుద్రంగి, మానాల కోనరావుపేట మండలంలో బావుసాయిపేట, ధర్మారం, కనగర్తి, కొండపూరం, మల్కాపేట, మామిడిపల్లి, మర్రిమడ్ల, మర్తనపేట్, నాగారం, నిమ్మపెల్లి, నిజామాబాద్, పల్లిమక్త, రామన్నపేట్, శింగాలపల్లి, సుద్దాల, వట్టిమల్ల, వెంకట్రావుపేట గ్రామాలను కలిపేందుకు 11 మండలాల్లో 152 రెవెన్యూ గ్రామాలను వీటీడీఏ పరిధిలోకి తీసుకువస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇక నుంచి ఆయా మండలాల్లోని గ్రామాలు వీటీడీఏ పరిధిలోకి త్వరలో రానున్నాయని నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అసత్యపు ఆరోపణలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం

ఇల్లంతకుంట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అసత్యపు ఆరోపణలతో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. దళితబంధు, కల్యాణలక్ష్మి పథకాల్లోనూ బీఆర్ఎస్ నాయకులు కమీషన్లు తీసుకున్నది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, మాజీ ప్యాక్స్‌చైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, ఏఎమ్‌సీ ఉపాధ్యక్షుడు ప్రసాద్, నాయకులు తాట్ల వీరేశం, సురేందర్‌రెడ్డి, రాజేశం, బడుగు లింగం, చంద్రమౌళి, మంద పెద్దబాల్‌రెడ్డి, బెజ్జంకి శ్రీనివాస్, ఆంజనేయులు, ప్రభాకర్, దాసు, అనీల్‌కుమార్, బాబు పాల్గొన్నారు.

సమష్టిగా ఆలయ పునర్నిర్మాణానికి పాటుపడదాం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సమష్టిగా ముందుకు సాగి ఆలయ పునర్నిర్మాణానికి పాటు పడాలని పలువురు పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయం ఆవరణలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. గ్రామంలోని అన్ని సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులతో ఈ నెల 27న సమావేశం ఏర్పాటు చేసి ఆలయ పునర్నిర్మాణానికి చేపట్టే చర్యలను ప్రణాళికబద్ధంగా రూపొందించాలని నిర్ణయించారు. అన్ని కుల, యువజన, మహిళ, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో ఆలయ అర్చకులు నవీన్‌ఆచార్య, సభ్యులు కిషన్, ఈశ్వర్, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నర్సయ్య, బాల్‌రెడ్డి, అనిల్, రాంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్, లక్ష్మణ్, పర్శరాములు, సందీప్, రాజు, శ్రీనివాస్, కిష్టారెడ్డి, బాబు, మల్లయ్య, పోశయ్య, రాములు, రాజుయాదవ్, వేణు, దేవయ్య పాల్గొన్నారు.

జాతీయ మానవహక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడిగా అనిల్‌రెడ్డి

ఇల్లంకుంట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ మానవహక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడిగా వడ్డిక అనిల్‌రెడ్డిని నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య తెలిపారు. మండలంలోని తాళ్ళపెల్లి గ్రామానికి చెందిన అనీల్‌రెడ్డి గతంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా, జిల్లా ఇంచార్జ్‌గా పనిచేశాడు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు పేదప్రజల పక్షాణ నిరంతరం పోరాటం చేస్తానని, ప్రజల హక్కులు కాపాడటానికి ప్రయత్నిస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుంకనపల్లి రాము, రాష్ట్ర నాయకులు తదితరులకు కృతజ్ఞతలు తెలిపాడు.

ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల మున్సిపల్ పరిధి శాంతినగర్‌లోని ప్రభుత్వ భూమిని కబ్జా చేయకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం వేములవాడలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సీపీఐ జిల్లా నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు మాట్లాడారు. సిరిసిల్ల పట్టణం శాంతినగర్ నడిబొడ్డును సర్వేనెంబర్ 1581లో విస్తీర్ణం 2 ఎకరాల 10 గుంటల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ భూమిని కొందరు ఆక్రమణదారులు కబ్జా చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. సీపీఐ జిల్లా నాయకులు పంతం రవి, సోమ నాగరాజు పాల్గొన్నారు.

నిందితులకు శిక్షపడడంలో పీపీల పాత్ర కీలకం

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నిందితులకు శిక్షపడడంలో పీపీల పాత్ర కీలకమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల బైపాస్ రహదారిలోని ఓ కల్యాణమండపంలో జిల్లాలోని పోలీసు అధికారులు, ఏపీపీలు, పీపీలు, కోర్టు కానిస్టేబుళ్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది కాలంలో 61 కేసులలో నేరస్థులకు శిక్షలు పడ్డాయన్నారు. ఇందులో మూడు కేసులలో జీవిత ఖైదు పడేందుకు పీపీలు, కోర్టు కానిస్టేబుళ్ల కృషి అభినందనీయమన్నారు. న్యాయాధికారులు, పోలీసు అధికారులు సమన్వయం చేసుకూంటూ నేరస్థులకు శిక్ష పడే విధంగా బాధ్యతగా కృషి చేయాలన్నారు. శిక్షల శాతం పెంచేలా పనిచేసే అధికారులకు, సిబ్బందికి రివార్డులు అందజేస్తామన్నారు. పీపీలు లక్ష్మి ప్రసాద్, శ్రీనివాస్, లక్ష్మన్, సందీప్, సతీష్, విక్రాంత్, కోర్టు కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ మురళీకృష్ణ, సిరిసిల్ల, వేములవాడ సీఐలు కె. కృష్ణ, వీరప్రసాద్, ఎల్లారెడ్డిపేట, చందుర్తి సీఐలు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచి సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం సిరిసిల్ల నుంచి మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26వేలు అందించాలన్నారు. అనేక సంవత్సరాలుగా పోరాటాలు చేస్తున్నా గత ప్రభుత్వం పట్టించుకోవలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతనాలు అందిస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా హామీలను అమలు చేయడం లేదన్నారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కాసారపు శంకర్,సుల్తాన్ నర్సయ్య, రాజయ్య, భారతమ్మ, నరేష్, బాబాకిషన్, ఉమ, లక్ష్మీ పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించకుంటే భవిష్యత్ కార్యాచరణ

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 28 వరకు ప్రభుత్వం స్పందించ కుంటే భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని, చేపట్టే కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా కమిటీ జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్ అన్నారు. సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా కమిటీ అధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 8వ రోజుకు చేరుకున్నాయి. ముస్తాబాద్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బొంపల్లి సురేందర్‌రావు రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కరుణాకర్, సురేందర్‌రావు మాట్లాడారు. సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని దీక్షలు చేపట్టినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. శాంతియుతంగా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రిలే నిరాహారదీక్షలను చేపడితే ప్రభుత్వం సర్పంచులను నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. ఈ నెల 28వ వరకు ప్రభుత్వం స్పందించకుంటే జేఏసీ ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసకుంటామన్నారు. జిల్లాకే పరిమితమైన సర్పంచుల ఉద్యమం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో మొదలు అవుతుందన్నారు. తాజా మాజీ సర్పంచుల రిలే నిరాహారదీక్షలకు సామాజిక ఉద్యమకారులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా కమిటి ప్రధాన కార్యదర్శి దుమ్మ అంజయ్య, ఉపాధ్యక్షురాలు గణప శివజ్యోతి, కార్యదర్శులు గున్నాల లక్ష్మన్, సిరికొండ శ్రీనివాస్, దోమకొండ ఎల్లం, కోల నర్సయ్య, తాడేపు ఎల్లం, గాండ్ల సుమతి, చల్ల నారాయణ, తాజా మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

ప్రజలు తిరస్కరిస్తేనే ప్రతిపక్షంలోకి

తంగళ్లపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ నాయకులను కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని కేటీఆర్ మాట్లాడడం సిగ్గుచేటని, ప్రజలు మిమ్మల్ని తిరస్కరిస్తేనే ప్రతిపక్షంలో పడ్డారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ అన్నారు. శుక్రవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుల చేతులకు సంకెళ్లు వేసిన మీరు రైతుల పక్షాన కొట్లడుతాం అనడం విడ్డూరంగా ఉందన్నారు. రైతు సంఘం నాయకులను, మేధావి వర్గాలను జైల్లో వేసిన విషయాన్ని గుర్తు చేశారు. రైతు రుణమాఫీ చేసి చూపిస్తే జీర్ణించుకోలేక పోతున్నారని విమర్శించారు. అదిలాబాద్ బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడిన తీరుపై మండిపడ్డారు. రైతుల పేరు మీద బహిరంగ సభలు ఏర్పాటు చేస్తూ అధికారులకు బహిరంగంగానే బెదిరింపులకు గురి చేయడాన్ని తప్పుబట్టారు. సీఎం రేవంత్ రెడ్డిపై అవాకులు చెవాకులు పేలితే సహించేది లేదని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకుల మాటలు రైతులెవరూ నమ్మొద్దన్నారు. ప్రతిపక్ష హోదను సక్రమంగా నిర్వహించాలని హితవుపలికారు. మూసి ప్రక్షాళన పేరు మీద వేల కోట్లను తిన్నది మీరు కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైఎస్ ప్రెసిడెంట్ నరసింగం, డైరెక్టర్లు ఆరేపల్లి బాలు,పొన్నాల పరశురామ్, పార్టీ మండల ఉపాధ్యక్షులు గుగ్గిళ్ల శ్రీకాంత్ గౌడ్, మండల బిసి సెల్ అధ్యక్షులు కావటి మల్లేశంయాదవ్‌పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

సిరిసిల్ల రూరల్/ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరా బేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో తిమ్మాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్యాక్స్ చైర్మన్ సుధీర్‌రావు, నాయకులతో కలిసి శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సబేరాబేగం మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలనే లక్ష్యంతో గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. రైతులు కేంద్రాలకు తరలించి విక్రయించాలని అన్నారు. సన్నాలకు రూ.500 మద్దతు ధర చెల్లిస్తోందన్నారు. దళారులను ఆశ్రయించి మోసపోకూడదని సూచించారు. కార్యక్రమంలో ప్యాక్స్ వైస్ చైర్మన్ కృష్ణమూర్తి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, తాజా, మాజీ సర్పంచ్ రవీందర్, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాజేందర్, శ్రీనివాస్, కిష్టారెడ్డి, నారాయణరెడ్డి, తిరుపతిరెడ్డి, చిన్నలక్ష్మీ, నాయకులు గౌస్, బుచ్చాగౌడ్, సంఘం కార్యదర్శి శశివర్ధన్ పాల్గొన్నారు.

: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని, మద్దతు ధర పొందాలని సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెల్ముల స్వరూప తిరుపతి రెడ్డి కోరారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్

సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఐకేపీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెల్ముల తిరుపతిరెడ్డి, గంభీరావుపేట ప్రశాంత్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు నాయకులు పాల్గోన్నారు. తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



వేములవాడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

ఇల్లంతకుంట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు మంద అనీల్‌కుమార్ మాట్లాడుతు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంటును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలలు అద్దె భవనాలలో ఇబ్బందులు పడుతున్నందున వెంటనే పక్కా భవనాలు నిర్మించాలని కోరారు. విద్యారంగంపై ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపుతోందన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా విద్యాశాఖ మంత్రి లేకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పెండెల ఆదిత్య, డీవైఎఫ్ కార్యదర్శి పినకాశి నాగరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు చిగుర్ల అనీల్, తుమ్మ అమన్, బట్టి మణికృష్ణ, దమ్మని సుమన్ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్ కుమార్ డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి ముట్టడించారు. తహసీల్దార్ మారుతిరెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులతోపాటు యాజమాన్యాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతుందన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న విద్యాశాఖ మంత్రిని ఏర్పాటు చేయకపోవడంతో విద్యావ్యవస్థ కుంటుపడుతోందన్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదని విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నారన్నారు. సర్టిఫికెట్ల కోసం తల్లిదండ్రులు వడ్డీకి అప్పులు తీసుకొచ్చే పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. వెంటనే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దినకర్, రాబిన్సన్, విద్యార్థులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: ఎన్నో యేళ్లుగా పెండింగ్‌లో వున్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. వేములవాడ తహసీల్దార్ కార్యాలయం ఎందుటకు పెద్ద ఎత్తున ర్యాలీగా తరలివచ్చి నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ మహేష్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకుడు మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ రూ. 8 వేల కోట్ల పైచిలుకు స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉందని, దీంతో విద్యార్థులు, కాలేజి యాజమాన్యం తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారని అన్నారు. ప్రభుత్వ కళాశాలలో చదువుకునే విద్యార్థులందరు పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారని స్కాలర్షిప్‌ల మీద ఆధారపడి విద్యనభ్యసిస్తున్నారని అన్నారు. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసుకుని పై చదువుల కోసం సర్టిఫికెట్స్ కావాలని ప్రైవేటు కళాశాలలకు వెళితే రీయింబర్స్‌మెంట్ రావడం లేదని, డబ్బులు కట్టాలని యాజమాన్యం సూచిస్తున్నారని, దీంతో తమ చదువును నిలిపివేయాల్సి వస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాయి భరత్, శివ, ప్రభాస్, రవితేజ, అఖిల్, రవి, సంతోష్, రిజ్వాన, ఆచల్, శ్రీవల్లి తదితరులు ఉన్నారు.


ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు